


సంఘటన ప్రధానంగా కధ రూపు దిద్దుకుంటుంది. గొప్పకధలు రచయితలు తాము అనుభవిస్తున్న అనుభవాలొంచి తాము చూస్తున్న ప్రకృతిలోనుండి సమకాలీన జీవన యాత్రనుండి సంతరించుకుంటాయి. అలాంటి కధలలోని పాత్రలతో ప్రయాణం చేస్తాడీ రచయిత చాలా దూరం.

గుండె పొరల్లోనుండి, గుండె లోతుల్లోనుంచి పిడికెడు ఆకలి పొట్టకోసం కంపార్టుమెంటు తుడిచే కుర్రవాడి పాట్లనూ బాధలనూ జాలిగా దర్శిస్తాడు. పరిష్కారంకోసం వాడితో ముందడుగువేసి క్రాంత దర్శకుడయ్యాడు.

శక్తి దాని పరిమాణం – శక్తి దాని పరిణామం. ఈ రెండూ యీ కధని గొప్పకధల్లో ఒకటిగా నిలుపుతాయి.

—వేమకోటి సీతారామశాస్త్రి.

గాలిని చీల్చుకుంటూ రైలుబండి రొద చేసుకుంటూ పోతూంది కిటికీలోంచి బయటకు చూస్తే పడమటి ఆకాశంలో నిష్క్రమించడానికి సిద్ధపడి, ఆవులిస్తూన్న పగటి వెలుగు–గూటికి చేరే ప్రయత్నంలో ఐకమత్యంగా ప్రయాణించే పక్షుల గుంపు.

చల్లటిగాలి మనసుకూ శరీరానికీ ఎంతో హాయిని చేకూరుస్తోంది.

ప్రయాణాలు ఎంత సుఖమైపోయాయి? కాసిన్ని డబ్బులు వెదజల్లితే ఎంత దూరమైనా ఎంత రద్దీవున్నా హాయిగా పడుకుని ఏ పుస్తకం చదువుకుంటూనో, నిద్రపోతూనో; రాత్రి గడిపేయటం. తెల్లారి గమ్యం చేరటం! అయినా డబ్బుతో కొనుక్కోలేని సుఖాలు లేవేమో యీ రోజుల్లో!

రైలు బండిలో కిటికీ ప్రక్క సీట్లో కూర్చుని ప్రయాణం చేయటంలో ఓ ఆనందముంది, ఓ థ్రిల్ వుంది.

పచ్చపచ్చటి పొలాలూ, చెట్లూ, ఎగిరే పక్షులూ, నల్లమబ్బులూ, కొండలూ, వాగులూ, నీలాకాశం. అన్నీ.... ఆ మాటకొస్తే ప్రకృతంతా కొత్తకొత్త ప్రేముల్లో దర్శనమిస్తూ వెనక్కు పోతాయి.

ఎన్ని దృశ్యాలు?

సీటుకి ఆనుకుని కూర్చుని ప్రకృతిని పరికిస్తున్నాను. నలుమూలల్నించీ చీకట్లు అలుముకుంటున్నా అక్కడక్కడా గతదినాల జ్ఞాపక చిహ్నాల్లా పగటి వెలుగు మిగిల్చిన కాంతులు!

కళ్ళు దృశ్యాల్ని చూస్తున్నా మనసులో ఏవేవో ఆలోచనలు.

అనుకోకుండా, వ్యవధి లేకుండా ఉద్యోగంలో వచ్చి చేరమని ఉత్తరువులు రావటంవల్ల బయల్దేరవలసి వచ్చింది. శాయి యిచ్చిన సలహా ప్రకారం కండక్టర్‌కి నాలుగు డబ్బులు ఎరచూపితే బెర్తు వచ్చింది. ఇక తెల్లారే వరకూ నిశ్చింత.

రేపట్నుంచీ జీవితం ఓ కొత్త మలుపు తిరుగుతుంది. కొత్తవూరు, కొత్తఉద్యోగం, కొత్తమనుషులు అన్నీకొత్తే.

చీకటి తెరలు దించుకుంటున్న ప్రకృతి అందంగా కనిపిస్తూనే వుంది కిటికీలోంచి. దగ్గరగా ఒకొండ గరుకుగా. పాపం నిశ్శబ్ద యేకాంతంలో వుండే దాని గుండెలో ఒక్కక్షణం రైలుబండి చప్పుళ్ళు. పందల జనం విడిచిన నిట్టూర్పుల వేడిగాలి నిశ్శబ్దంలోంచి ... సుషుప్తిలోంచి ... ఆ ఒక్కక్షణం జరిగి మళ్ళీ అంతలోనే నిశ్శబ్దాన్నీ చీకట్నీ యేకాంతాన్నీ కప్పుకుని మిగిలిపోతుంది.

ఏవేవో వూహలు.... గజిబిజిగా— కిటికీలో కొండ మాయమైంది.

దృష్టిని కంపార్టుమెంట్లోకి మరల్చాను. ఎదురుగా గల సీట్లో ఎవరో వయసు మళ్ళిన ముసలాయన। ఆయన ప్రక్కగా కూర్చున్న యిదరూ ఆ ఎదుటి సీట్లో కూర్చున్న యిద్దరితో పేకాట మొదలు పెట్టారు. కిటికీప్రక్క విడివిడి సీట్లలో యిద్దరాడవాళ్ళు. ఒకామెకు వయసు పాతిక మించదు. దొండ పళ్ళలాంటి పెదవులు అసహ్యంగా వున్నాయామె ముఖానికి. ఆమె చేతుల్లో ఓ పసికందు. రెండోసీట్లో ఆవిడగారి తల్లి కాబోలు కమలా ఫలాల బుట్టను ముందేసుకుని, ఒలుచుకుంటున్న పండు తొనల్ని నోట్లో పడేసుకుంటోంది.

కంపార్టుమెంటు చివర్నించి కదలి వస్తున్నాడు కండక్టరు. అతని వెనుక వంది మాగధుల్లా బెర్తులకోసం జనం।

కంపార్టుమెంటు రెండో చివరికొచ్చి టాయిలెట్ డోర్ దగ్గర నిల బడ్డాడు. చేతిలోవున్న చార్టువంకచూసి, ఆ తర్వాత చూపుదించి, చటుక్కున కనుబొమ్మలు ముడిచేడు.

అందరి దృష్టి అటు తిరిగింది.

క్రిందన.... తలుపు ప్రక్కన మూలగా కాళ్ళు ముడుచుకుని కూర్చున్నాడెవడో।

'ఎవడ్రా' గద్దించాడు కండక్టరు.

చేతులెత్తి దండం పెట్టేడు వాడు. చిరుగుల చొక్కా, చేతిలో పాత మురికిగుడ్డ.

ఏమనుకున్నాడో.... మళ్ళీ తనపనిలో తాను నిమగ్న మయ్యేడు కండక్టరు.

గాలిలో తేలిపోతోందా అన్నంత జోరుగా పోతోంది రైలుబండి.

అభిమాన రచయిత్రి నవల విప్పి అందులో పూర్తిగా లీలమై పోయింది దొండపండు పెదవుల అమ్మాయి.

పేకాట అయిపోయినట్లుంది. డబ్బులు పోగుచేసు కుంటున్నాడు పేకాట రాయుళ్ళలో ఒకడైన బానపొట్ట బాపనయ్య.

ఆ పక్కనున్న ముసలాయన మాత్రం సంచీలోని ఉత్తరాలు పైకి తీసి చదూకుంటున్నాడు.

పాదాలకు ఏదో తగిలినట్లయి కాలు జరిపి, క్రిందికి చూశాను.

ఇందాక.... కంపార్టుమెంటు మూలన కూర్చొని, కండక్టర్‌కి మూగగా దండాలు పెట్టిన కుర్రాడు. మురికి గుడ్డతో కంపార్టుమెంటును శుభ్రంగా తుడుస్తున్నాడు. ఎవ్వరివంకా చూడకుండా తనపని తనదేన న్నట్లు అందరి కాళ్ళ మధ్యనుంచీ చోటు చేసుకు మరీ శుభ్రపరుస్తు న్నాడు.

నవలా పాఠకురాలి తల్లి చేతిలోవున్న కమలా పళ్ళ తొక్కల్ని క్రింద పడేసి, "ఒరేయ్. ఇవీ తీసుకుపో" అని పురమాయించింది. అందరు వదిలేసిన మురికినీ, చెత్తనీ ఆనందంగానే స్వీకరించి తుడుచుకు పోతు న్నాడు వాడు.

"తేలిగ్గా డబ్బు సంపాదించడమెలాగో నేర్చుకుంటున్నారంద రూను. వాడుచూడండి. ఈ కంపార్టుమెంటంతా తుడిచాడు! ఎందుకనుకు

న్నారు? మరో అయిదు నిముషాల్లో వస్తాడు తుక్కు పారేసి వచ్చిచేతులు చాస్తాడు. తమ కాళ్ళక్రింద దుమ్ము తుడిచినందుకు అందరికీ వాడిమీద జాలిపుట్టి తలో పది పైసలు ఇస్తారు. ఎలా లేదన్నా కంపార్టుమెంటుకో నాలుగైదు రూపాయలు కిడతాయి ఎంత కష్టపడితే వస్తాయండీ నాలుగు రూపాయలూ?! బానకడుపు బాపనయ్య అంటున్నాడు పేక కలుపుతూ.

"అదేంమాటలెండి! వాడూ వూరికెనే అడుక్కోవటం లేదుగా. ఏదోపని చేసే అడుగుతున్నాడు" అన్నాడు ముసలాయన కలిపించుకుని.

"ఎందుకు చెయ్యాలి. ఆ పని చెయడానికి రైల్వే స్వీపర్లున్నారు. ఏదో.... మన ముందు చేసేనని పించుకోడానికి, సానుభూతీ, డబ్బు సంపాదించ డానికేను"

"అలా అంటే నేవొప్పుకోను. బండి బయల్దేరిన స్టేషన్‌లో ఎక్కేనునేను. అప్పట్నించి అంతచెత్తా మనకాళ్ళ కిందవుంది. వండలు పుచ్చుకుంటున్న వాళ్ళే డ్యూటీగా చెయ్యాల్సిన పని చెయ్యనపుడు చిల్లర డబ్బులకోసం వీడు చెయ్యటంలో ఎంతో సిన్సియారిటీ కన్పిస్తోంది"

ముసలాయన మాటలకి జవాబివ్వలేదు బానకడుపాయన. ముక్కలు పంచేసి, ఆటలో దిగిపోయాడు.

పసివాడు ఏడుపు మొదలెట్టడంతో పుస్తకం మూసేసింది దొండ పండు పెదవుల వనిత. కమలాపళ్ళ తల్లిగారు అప్పటికే కూర్చునే గుర్రు పెడుతున్నారు.

సీట్లో కూర్చొని కాళ్ళుడోర్‌కి తన్నిపెట్టి సిగరెట్ కాలుస్తున్నాడు కండక్టరు.

"బాబూ" అంటూ నేలమీద కూర్చునే చేతులు చాచాడు వాడు!

"నేచేప్పలేదూ?" బానకడుపు ముసి ముసి నవ్వులు.

మూగవాడు కాదన్నమాట! పరీక్షగా చూశాను వాడి వంక. పన్నెండేళ్ళుంటాయేమో! కళ్ళలో దీనత్వం, అభ్యర్థనా.

ముసలాయన లాల్చీ జేబులోంచి పావలా తీసి పడేశాడు వాడి చేతిలో. ఆయన ఆలోచనలో, దానబుద్ధీ, ఉదార స్వభావం నాకు నచ్చింది. జేబులోంచి కాస్త చిల్లర తీసి వాడిచేతిలో పోశాను. ఆ తర్వాత మరి కొందరు ఐదులూ పదులూ పైసలేశారు.

బానకడుపాయన మాత్రం పైపు కూడ విదల్చలేదు. ఆయనన్న దానికి ముసలాయన ఖండించకుండా వుంటే ఎలా వుండేదో!

"చిల్లరలేదు సిగిరెట్టు కాలుస్తావేమిట్రా" అన్నాడు పేకాట రాయు ళ్ళలో ఒక చైన్ స్మోకరు.

"ఒద్దండీ" అన్నాడు వాడు.

"అయితే నీ ఖర్మ పో. నాదగ్గరవే వున్నాయి."

మళ్ళీ పేకలోకి దిగేడాయన.

ఆ కుర్రాడు ముందుకు పోయాడు చేతులు చాచి అడుక్కుంటూ.

"ఎప్పైనా యీ అడుక్కోడాల్ని మనం ఎంకరేజ్ చేయకూడదు గురూ. కన్నొంకరా? కాలొంకరా వీడికి? గడిచి పోతూంటే పెద్దయినా వీడీ వృత్తిని వదలడు అందుకే ప్రభుత్వం బిక్షాటన నిషేధించింది. నన్న డిగితే యీ అడుక్కునే వాళ్ళందర్నీ తీసుకెళ్ళి రెండుపూటలా తిండిపెట్టి ఏ కొండ దగ్గరో రాళ్ళు కొట్టించాలి"

బానకడుపు తన కసినంతా తీర్చుకున్నాడు.

రైలు చాల దూరం ప్రయాణించేక ఆగింది.

అది మీల్స్ స్టేషను. దొండపెదవులు వనితా, కమలా పళ్ళ తల్లీ, భోజనాలు తెప్పించుకున్నారు. పేకాట రాయుళ్ళు రెండేసి పూరీలు తిని నీళ్ళు త్రాగేరు.

ముసలాయన పళ్ళుతిని మజ్జిగ త్రాగేడు.

నేను అయిందని పించాదోనే.

పెట్టెలోకి తోసుకుని ఎక్కుతున్న జనాన్ని ఆపి, కేకలేస్తున్నాడు కండక్టరు.

"అన్నీ పడుకుని పోయే పెట్టిలే అయితే మే మెందులో చస్తాం" అంటున్నాడొక ముసిలాడు ప్లాట్‌ఫాం మీంచి.

నిజమే, పెరుగుతున్న జనాభాకి తగినన్ని సదుపాయాలు లేవు. ఇళ్ళులేవు. ఉద్యోగాల్లేవు ఉపాధులులేవు. చాలినన్ని బస్సులులేవు. ఉన్న రైళ్ళలో సామాన్యుడికి కనీసం నిలబడి ప్రయాణం చేసేందుకు చాలినన్ని పెట్టెలులేవు.

జనం....జనం....ప్రతి స్టేషన్‌లోనూ, ప్రతి పెట్టెలోనూ జనమే. బండి కదిలింది. డోర్ లాక్ చేసి కూర్చున్నాడు కండక్టరు.

బండి వేగాన్ని పుంజుకుంది. పేకాట సాగుతూనేవుంది. నవల చదివేస్తూనే వుంది.

కిటికీలోంచి గాలి రివ్వున వీస్తూంది. దూరంగా మినుకు మినుకు మని కన్పిస్తున్న దీపాలు జరిగి వెనక్కి పోతున్నాయి.

ఎంత సేపైందోయేమో బాపనయ్య గొంతు ఖంగుమంటే తల తిప్పి చూశాను.

"ఇక్కడే పెట్టానండి ఇంతలోనే ఎక్కడికి పోతుందీ? మొద టాట ఆల్‌కౌంటిచ్చి నప్పుడు తీశాను. ఆ తర్వాత తియ్యాల్సిన అవసరం రాలేదు."

ఎవరెవరో ఏవేవో ప్రశ్నలు వేస్తున్నారు.

"సరిగా చూడండి. ఎవరొచ్చారింతలోకే" అంటున్నాడు ముసలా యన.

"ఎవరొచ్చారని కాకుండా ఎవర్రాలేదని అడగండి బావుంటుంది. రిజర్వుడు పెట్టె అని పేరేగాని బఠానీలవాడూ, చేకోడీలవాడూ, అరటి పళ్ళవాడూ....టీలవాడూ వీళ్ళందరూ చేత్తో తట్టి మరీ కావాలా అని అడుగుతున్నారు." అంటున్నాడు చైన్ స్మోకర్.

ముసలాయన నాకెందుకన్నట్లు వూరుకున్నాడు.

"వీళ్ళంతా కాకుండా వాడొక డొచ్చాడుగా అడుక్కోడానికీ. ఇదె వాడి పనే అయి వుంటుంది" అంటున్నాడు భపనయ్య.

ఒక్కక్షణం నమ్మలేనట్లుండి పోయాను.

"సంచులూ అవీ సర్ది మరీ తుడిచాడు. అసలటువంటి వెధవల్ని కంపార్టుమెంటు ఎక్కనీయడమే పొరపాటు. డబ్బువేసి మనమే ఎంక రేజ్ చేస్తుంటే యిలాగే వుంటుంది మరి. నేనేమీ యివ్వలేదని కొట్టేసి వుంటాడు. ఆ చూపులోనే కన్పించింది దొంగబుద్ధి"

"వాడే అయితే ఫర్వాలేదు. ఇక్కడే ఎక్కడో వుంటాడు, నాలుగు తగల్నిస్తే వాడే యిచ్చేస్తాడు. అన్నారెవరో.

ఏమనడానికీ తోచలేదు నాకు.

"ఇంతకీ ఎంతంటుంది పర్సులో"

"ఎంతోలేదులేండి. పాతికోముప్పయ్యో. అంతే. పెద్ద పర్సు జాగ్రత్త చేసి రైలు ఖర్చులకి చిల్లర అవసరముంటుందని దీన్ని బయ టుంచా"

"ఎక్కడికి పోతాడూ....ఇదిగో పక్క కంపార్ట్‌మెంట్‌లోనే వున్నాడు" ఎప్పుడు వెళ్ళాడో చైన్‌స్మోకర్ వాణ్ణి పట్టుకొని లాక్కొ చ్చాడు. అతని కుడిచేతి గుప్పెట్లో వాడి చిరుగుల చొక్కా నలుగుతోంది.

"పర్సెక్కడ దాచావ్‌రా" అడిగేడు బాపనయ్య.

"ఏ పర్సు బాబూ నాకేం తెలీదు"

"ఎందుకు తెలుస్తుందీ....ఆ జేబులు చూడూ"

చిల్లర ఘల్లుమని క్రింద పడింది. అన్నీ పదులూ, ఐదులూ, పైసల బిళ్ళలు. బిత్తర బోయి చూస్తున్నాడు వాడు.

"బ్రతక నేర్చిన వెధవ. యీపాటి కెవడికో అందించేసేవుంటాడు అన్నారెవరో.

"నాకు తెలీదు బాబుల్లారా. నేను తియ్యలేదు" అంటున్నాడు వాడు

"దొంగాళ్ళంతా నిజం అంత సుళువుగా ఒప్పేసుకుంటే పోలీసుల మీద అన్ని నిందలెందుకొస్తాయి. నిజం ఎలా రాబట్టాలో మాకూతెల్సు."

చేతులు లేచాయి.

నాయకులకు జేజేలు కొట్టినచేతులు. ఓట్లేసిన చేతులు.... పీకాడిన చేతులు....

చూళ్ళేక తల తిప్పేసుకున్నాను.

దెబ్బలూ తిట్లూ....ఏడ్పులూ... అన్నీ అయ్యేయి.

"లాభంలేదు వచ్చే స్టేషన్‌లో రైల్వే పోలీసుల కప్పగిం స్తేసరి।"

ఆ మాటలు లీలగా విన్పించాయి.

మగతగా నాకళ్ళు మూతలు పడ్డాయి.

మళ్ళీ మెలుకువ వచ్చి చూసేసరికి కంపార్ట్‌మెంటంతా నిశ్శబ్దంగా వుంది. టాయ్‌లెట్‌కి వెళుతూ చూశాను. పేకాట రాయుళ్ళిద్దరూ నిద్దరోతు న్నారు. బాపనయ్య దుప్పటి సర్దుకుంటూ నిద్రకుపక్రమిస్తున్నాడు.

"ఏమైంది. మీ పర్సు దొరికిందా" అడిగాను.

"దొరికింది"

"వాడేనా" అడిగాను ఆశ్చర్యంగా.

"కాదు. వెధవ అనవసరంగా దెబ్బలు తిన్నాడు. పర్సు నా చేతి సంచిలోనేవుంది. సూట్‌కేస్ చాలక దుప్పటీ తువ్వాలూ సంచిలో పెట్టు కున్నాను టిఫిన్ చేశాక తువ్వాలు తీశాను బహుశ. అప్పుడు పర్సుఅందు లోకి జారిపోయి వుంటుంది. ఇందాక దుప్పటి తీస్తుంటే కన్పించింది.... అతి మామూలుగా చెబుతున్నాడతడు.

నేను ముందుకు కదలేను.

డబ్బు, అహంకారం మనిషి చేత ఏ పనైనా చేయిస్తాయి! వస్తూ చూశాను. టాయిలెట్ ప్రక్క నెలమీద మూలగా ముడుచుకుని పడుకు

న్నాడు వాడు. ఏడ్చిన కన్నీటి చారికలు ఆ మురికి చెంపలమీద స్పష్టంగా కన్పిస్తున్నాయి.

అర్థరాత్రి దాటింది. అంధకార మార్గంలో రైలుపరుగులు తీస్తూనే వుంది.

ఆలోచనల మధ్య ఎప్పుడు పట్టిందో నిద్ర.... మెలుకువ వచ్చేసరికి తూర్పు ఆకాశంలో చీకటి విడిపోతోంది. చీకటి వెలుగులతో నిమిత్తం లేకుండానే రైలుబండి వగర్చుకుంటూ పరుగులెడుతూనే వుంది.

ముఖం కడుక్కోడానికి వెళుతూ ఆ మూలకి చూశాడు.

ఆశ్చర్యం. వాడక్కడ లేడు.

బాపనయ్య మాత్రం యింకా గుర్రు పెడుతూనే వున్నాడు. అతని సీటుక్రింద ఖాళీ బ్రాందీ సీసా!

రైలు గమ్యం చేరింది.

బండిదిగి, ప్లాట్‌ఫాంమీది కాప్టీరియాలో కాఫీతాగి డబ్బులిస్తూ ప్రక్కకు చూశాను.

ఎదురుగా దీనవదనంతో.... వాడు!

అమాయకంగా, జాలిగా నావంకే చూస్తున్నట్లనిపించింది. కళ్ళతోనే సైగచేసి పిలిచాను. వచ్చి కొంచెం దూరంలో నిల్చున్నాడు.

'టీ తాగుతావా'

తాగుతానన్నట్లు తలూపేడు.

టీ గ్లాసు చేతికందించాను. ఆ బాగా అకలిగావున్న వాడిలా గబగబా తాగేసి నా వంక చూశాడు. ఆ చూపులో కృతజ్ఞతా భావం కన్పించింది.

ఇలా అడుక్కునే బదులు, ఏదైనా పని చేసుకు సంపాదించుకోరాదు' అన్నాను. అప్పటికప్పుడు సాధించుకున్న అధికారం, పెద్దరికంతో.

వెంటనే ఏం మాట్లాడలేదు వాడు. కాస్సేపాగి,

'నా కెవరిస్తారు బాబా పని? ఏపనీ దొరక్క యీ పెట్టె లాడ్చి అడుక్కుంటున్నా. అయినా యిది పనికాదా బాబూ' అన్నాడు.

వాడికేం జవాబు చెప్పాలో నాకర్థం కాలేదు.
సలహా యిచ్చినంత సులువుకాదు బతుకుతెరువు కల్పించడం.

నిరుద్యోగం, పేదరికం రాజ్యమేలుతున్న దేశంలో బతుకు తెర వెందరికి?

బ్యాగ్ చేతిలోకి తీసుకున్నా అడుగు ముందుకు పడలేదు.

"ఏ పని యిచ్చినా చేస్తావా నమ్మకంగా' అడిగాను వాడివంక చూసి.

'తిండికోసం ఏ పనైనా చేస్తాను బాబూ. మాయ నాకు చేతకాదు' అన్నాడు. ఆ మాటలో నిజాయితీ కన్పించింది.

'అయితే రా' అంటూ బ్యాగ్ వాడి చేతికందించి అడుగు ముందుకు వేశాను.

నేనేం చేయదల్చుకున్నాను. ఎలా వీడికి బ్రతుకుతెరువు కల్పించ గలను? ఈ ప్రశ్నలకు, సమస్యలకు అతీతంగా మనసులో ఎంతో సంతృప్తి!

దేశం, సంఘం, ప్రభుత్వం, కులం, మతం ... యివేవీ పరిష్కరించలేని సమస్యను వ్యక్తిగా నేను పరిష్కరించగలనా? ఏమో!

నాకు తెలీకుండానే నా అడుగులు వేగంగా ముందుకు పడ్డాయి.

(కృష్ణాపత్రిక 1-15 నవంబర్ 1984)